క్లుప్తంగా

త్రిపుర గవర్నర్‌ను కలిసిన గానుగుబండ సర్పంచ్



ఇంద్రసేనారెడ్డిని కలిసిన రామచంద్రారెడ్డి

తుంగతుర్తి : గానుగుబండ గ్రామానికి చెందిన నల్లు ఇంద్రసేనారెడ్డి ఇటీవల త్రిపుర గవర్నర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గానుగుబండ గ్రామ సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి త్రిపురలో గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు.

కూరగాయలు అమ్ముతూ ప్రచారం



కేటీ అన్నారంలో కూరగాయలు అమ్ముతూ ప్రచారం చేస్తున్న జీడి భిక్షం

సూర్యాపేట రూరల్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలని జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. శనివారం కేటీ అన్నారంలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయలు అమ్ముతూ వినూత్నంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి అలివేలుభీమ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కాటసాని వెంకట్‌రెడ్డి, కొడిదెల శ్రీనివాస్‌రెడ్డి, నక్క జానీ, ఉయ్యాల దశరథ తదితరులు పాల్గొన్నారు.

నాగారం ఎంపీఓకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఎంపీఓ శ్రీనివాస్

నాగారం : నాగారం మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ)గా పనిచేస్తున్న ధార శ్రీనివాస్ సామాజిక, సాహిత్య రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వారు శనివారం హైదరాబాద్‌లో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ బిషప్ విల్సన్‌సింగం చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఫౌండర్, చైర్మన్ బిషప్ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ వర్తింపజేయాలి

అర్వపల్లి : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అమలుచేయాలని మండల పరిషత్ కో–ఆప్షన్ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు ఎస్‌కె. జానిపాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు సగం మంది రైతులకు కూడా రుణమాఫీ వర్తించలేదని చెప్పారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

తిరుమలగిరి : కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల పట్ల విశ్వాసంతో వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్ తెలిపారు. శనివారం దుబ్బ తండాకు చెందిన 25 కుటుంబాల సభ్యులు బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, సోమనర్సయ్య, టీక్యా, రవినాయక్, గూడ నాగరాజు, వెంకట్, రాఖేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు భారీగా ధాన్యం



తిరుమలగిరి మార్కెట్‌లో పోసిన ధాన్యం

తిరుమలగిరి : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు శనివారం రైతులు భారీగా ధాన్యం తీసుకొచ్చారు. ఒక్కరోజే 23,493 బస్తాల ధాన్యం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. గరిష్ఠంగా క్వింటాకు రూ.1,948, కనిష్ఠంగా రూ.1,719 పలికినట్లు పేర్కొన్నారు.

ఆర్డీఆర్ పేరును ప్రకటించాలి

మద్దిరాల : సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి పేరును ప్రకటించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగెల్లి అరుణ్‌కుమర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనాదరణ కలిగిన నేత ఆర్డీఆర్ అన్నారు. తుంగతుర్తి, పాలేరు, ఇల్లందు, సాగర్, ఉప్పల్, కొత్తగూడెంలో అభ్యర్థులను గెలిపించే సత్తా కలిగిన నేత దామోదర్‌రెడ్డి అని తెలిపారు. ఈ సమావేశంలో బర్పటి ఉపేందర్, సోమేశ్వర్‌రావు, సందీప్‌రావు, రమేష్, ఎల్లేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం.. సమస్యల నిలయం

- శిథిలావస్థకు చేరిన పెన్‌పహాడ్‌లోని గ్రంథాలయం
- వర్షం వస్తే భవనం కురుస్తూ తడుస్తున్న సామగ్రి
- స్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో భయాందోళనలో పాఠకులు, సిబ్బంది



శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనం



గ్రంథాలయ భవనంపై పెరిగిన చెట్లు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని శాఖ గ్రంథాలయం సమస్యలకు నిలయంగా మారిందని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఏ క్షణంలో భవనం కూలుతుందోనని పాఠకులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. స్లాబ్‌పై కప్పు పూర్తిగా శిథిలమైంది. గ్రంథాలయంలో వివిధ రకాల దినపత్రికలు, వారపత్రికలు, కాంపిటేటివ్ బుక్స్, భారత, రామాయణం, చారిత్రక పుస్తకాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఉపయోగించుకోవడానికి సరైన వసతులు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో గ్రంథాలయంలో కురుస్తుండడంతో పాఠకులకు అసౌకర్యంగా మారుతుంది. గదులు చిత్తడిగా మారుతున్నాయి. అంతేకాకుండా గ్రంథాలయం ఆవరణ మొత్తం వర్షపు నీరు నిలిచి చెరువుని తలపిస్తుంది. గత్యంతరం లేక పాఠకులు నీళ్లలోనుంచే వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. గ్రంథాలయ భవనం తలుపులు, కిటికీలు చెదలు పట్టడంతో పుస్తకాలను భద్రపర్చడం కూడా సిబ్బందికి ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించాలని పాఠకులు, ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయాన్ని ఉపయోగించుకోలేక పోతున్నాం

మండల కేంద్రంలో గ్రంథాలయం ఉన్నప్పటికీ సరైన వసతులు లేక ఉపయోగించుకోలేక పోతున్నాం. వర్షాకాలం వచ్చిందంటే గదులన్నీ కురవడంతో పాఠకులు కూర్చోలేక ఇబ్బందులు పడుతున్నారు. పుస్తకాలు, నవలలు, దినపత్రికలు చదువుకోలేక పోతున్నాం.

– వెంకటేశ్వర్లు, పెన్‌పహాడ్

నూతన భవనం నిర్మించాలి

శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలి. భవనం శిథిలావస్థకు చేరడంతో ఏళ్ల తరబడి పాఠకులు అవస్థలకు గురవుతున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా నూతన భవన నిర్మాణం చేపట్టాలి.

– లింగయ్య, మాచారం

రైతుల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం



పెన్‌పహాడ్ : పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి



చివ్వెంల : కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి

పెన్‌పహాడ్ : రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం భక్తాళాపురంలో ధర్మాపురం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరడంతో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, పీఏసీఎస్ చైర్మన్‌లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, సర్పంచ్ నెమ్మాది నగేష్, వావిళ్ల రమేష్‌గౌడ్, జుట్టుకొండ గణేష్, లింగయ్య, నీలాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక

చివ్వెంల : రోళ్లబండ తండా గ్రామానికి చెందిన వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం మంత్రి జగదీష్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ధరావతు కుమారి బాబు నాయక్, జెడ్పీటీసీ సంజీవ్ నాయక్, మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, గుర్రం సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వ్యక్తిగత కార్యదర్శి సమక్షంలో..

సూర్యాపేట రూరల్ : మంత్రి జగదీష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఆయా పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి వ్యక్తిగత కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆరెగూడెం గ్రామానికి చెందిన వార్డు మెంబర్ సిరపంగి సరితతో పాటు 100మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మధు, అజిత, గీతా, వెంకటేష్, ముత్యాలు, రామదాసు, రాంబాబు, శ్రీను, రాములమ్మ, యాకూబ్, కవిత, ప్రవీల, రజితతో పాటు 100మంది కార్యకర్తలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ పులగం స్వాతిరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలి

అర్వపల్లి : గత పదేళ్ల కాలంలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ చేపట్టిన అభివృద్ధిని చూసి ప్రజలు ఆశీర్వదించాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శనివారం తిమ్మాపురంలో మామిడి నరేష్‌తో పాటు కొంతమంది బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కందుల దశరథరామారావు, టీఎంపీఎస్ రాష్ట్ర చైర్మన్ ఈదునూరి సంతోష్, పాలసంఘం చైర్మన్ చల్లా వేణుధర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు తండ లింగమూర్తి, బూర్గుల రాంబాబు, సుందర్, వెంకన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సుదర్శన హోమం



చివ్వెంల : హోమం పూజల్లో పాల్గొన్న భక్తులు



అర్వపల్లి : హోమం నిర్వహిస్తున్న అర్చకులు

చివ్వెంల : ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో శనివారం ఆశ్వయుజ మాస పౌర్ణమి సందర్భంగా శ్రీలక్ష్మీనారసింహ, శ్రీసుదర్శన హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ కిరణ్ కుమార చార్యులు, శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్ఛరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బంధకవి క్రిష్ణమోహన్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లిలో శ్రీ మహాలక్ష్మీయాగం..

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం శ్రీ మహాలక్ష్మీయాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శాంతి కల్యాణం జరిపారు. అలాగే భరద్వాజ ఆశ్రమంలో మహాపూర్ణాహుతి, గోపూజ, సుహాసిని పూజ చేశారు. పాడి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మహాలక్ష్మీయాగ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్ తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు విఖనసచార్యులు, పవన్‌కుమార్, మాధవాచార్యులు, ఆనంద్‌దీక్షితులు, శేషాచార్యులు, చక్రవర్తి, మాజీ ఎంపీపీ తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, ఎస్‌బీఐ బ్యాంక్ క్యాషియర్ రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాదరి కిషోర్ గెలుపొందాలని పూజలు

మద్దిరాల : ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని కోరుతూ జి.కొత్తపల్లిలో శనివారం అంజనేయస్వామి ఆలయంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు గంగవెల్లి వెంకటనర్సింహారావు, జిల్లా లీగల్‌సెల్ నాయకులు జిలకర్ర చంద్రమౌళి, నాయకులు గంగవెల్లి రాజేంద్రప్రసాద్, భాస్కర్‌రావు, బొబ్బిలి ఉప్పలయ్య, పులిగిల్ల వెంకన్న, ఉపసర్పంచ్ మురారి జనార్దన్, మేకల కవిత లింగయ్య, వెంకటరెడ్డి, ఉపేందర్‌రావు, వెంకన్న, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.10వేల ఆర్థికసాయం

అర్వపల్లి : మండల పరిధిలోని కోడూరుకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు చిలకబత్తిని సారంగ శనివారం మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబానికి టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ రూ.10వేలు ఆర్థికసాయం పంపించారు. సారంగ మృతికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు సామ అభిషేక్ రెడ్డి, సర్పంచ్ గుయ్యని బాబు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నిద్ర సంపత్, స్థానిక కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు.

సీనియర్ సిటిజన్స్‌కు పోస్టల్ బ్యాలెట్



సీనియర్ సిటిజన్స్‌కు 12డీ ఫామ్స్ ఇస్తున్న సిబ్బంది

తిరుమలగిరి : పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయలేని సీనియర్ సిటిజన్స్ కోసం ఎన్నికల సంఘం ప్రత్యేక అవకాశాన్ని కల్పించింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా సదుపాయం కల్పిస్తోంది. ఇందులో భాగంగా తుంగతుర్తి నియోజకవర్గంలో అధికారులు 12డీ ఫారాలు అందిస్తున్నారు. బీఎల్‌ఓలు పోలింగ్ బూత్ పరిధిలో ఉన్న 80 ఏళ్ల పైబడి వయస్సు వారిని గుర్తించి 12డీ ఫారం అందజేస్తున్నారు. తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా 80 ఏళ్లకు పైబడిన వారు 4435 మంది ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. సిబ్బంది వీళ్లందరి దగ్గరకు వెళ్లి 12డీ ఫారాలు అందిస్తారు. ఈ ఫారాలు అందుకున్న సీనియర్ సిటిజన్స్ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం వినియోగించుకోవాలని భావిస్తే నవంబర్ మొదటి వారంలోపు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. అందిన దరఖాస్తుల ప్రకారం అధికారులు సీనియర్ సిటిజన్స్‌కు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోలేని దివ్యాంగులు కూడా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

బీసీ నినాదంతో పోటీ అభినందనీయం



పార్టీలో చేరుతున్న న్యాయవాదులకు కండువాలు కప్పుతున్న వట్టె జానయ్యయాదవ్

భానుపురి : సూర్యాపేట నియోజకవర్గంలో అగ్రకులాల పెత్తనం సాగుతుందని, ఇన్నాళ్లకు వట్టె జానయ్యయాదవ్ బీసీ నినాదంతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం అభినందనీయమని సీనియర్ న్యాయవాది తంతెనపల్లి భిక్షమయ్యగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని కస్తూరి బజారులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతుందని అన్నారు. రిజర్వ్‌డ్ స్థానాలు మినహా ఎక్కడా అణగారిన వర్గాలకు స్థానం లేకుండా పోయిందన్నారు. 1998లోనూ సూర్యాపేట బార్ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలను చిన్నచూపు చూస్తే ఎదిరించి నిలిచామని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఎస్పీ తరఫున పోటీ చేయనున్న వట్టె జానయ్యయాదవ్‌కు మద్దతు ఇచ్చి ప్రచారం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు మాండ్ర మల్లయ్యయాదవ్, మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ నాయకుడు బానాల విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు సుంకరబోయిన రాజు, కిశోర్, న్యాయవాదులు అనిశెట్టి రేణుక, సతీష్, వేల్పుల అనిల్ తదితరులు వట్టె జానయ్యయాదవ్ సమక్షంలో బీఎస్పీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే మల్లేష్‌యాదవ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌లేక.. అప్‌డేట్‌కు ఇక్కట్లు

- జాజిరెడ్డిగూడెం మండల పరిధిలో లేని ఆధార్ సెంటర్లు
- వివరాల అప్‌డేట్ కోసం సూర్యాపేట, తుంగతుర్తి ప్రాంతాలే దిక్కు
- అర్వపల్లిలో ఆధార్ కేంద్రాన్ని పునరుద్ధరించాలని ప్రజల వినతి



తుంగతుర్తిలోని ఆధార్ కేంద్రం వద్ద ఉన్న జనం

అర్వపల్లి : రేషన్ కార్డులకు ఈ–కేవైసీ ప్రక్రియ నిర్వహిస్తుండటంతో ప్రజలు రేషన్ దుకాణాలకు, ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ముఖ్యంగా చిన్నారుల వేలిముద్రలు పడకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఆధార్ అప్‌డేట్ కోసం జాజిరెడ్డిగూడెం మండలపరిధిలో స్థానికంగా ఆధార్ సెంటర్ లేక సుదూర ప్రాంతాల్లోని సూర్యాపేట, తుంగతుర్తి ప్రాంతాలకు వెళ్తున్నారు. పైగా ఈ–కేవైసీ ప్రక్రియ పూర్తి చేయడానికి గడువుపై స్పష్టత లేకపోవడంతో గందరగోళానికి గురవుతున్నారు.

ఆధార్ కేంద్రాలకు వెళ్లడానికి..

వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన చాలా మంది ప్రజలు రేషన్ కార్డులకు ఈ–కేవైసీ చేసుకోవడానికి సొంతూళ్లకు తరలివచ్చారు. రేషన్ కార్డులకు ఈ–కేవైసీ చేసుకోవడానికి ఆధార్, ఇంటర్‌నెట్ కేంద్రాలు, రేషన్ దుకాణాలకు వెళ్తున్నారు. అయితే పదేళ్ల కిందట ఆధార్ కార్డులు పొందినప్పుడు చాలామంది చిన్నారుల వేలిముద్రలు తీసుకోలేదు. ఐదేళ్ల లోపు చిన్నారుల నుంచి వేలిముద్రలు తీసుకోరు. ఐదేళ్లు నిండాక వేలిముద్రలు, ఐరీష్ తీసుకొని అప్‌డేట్ చేస్తారు. కానీ జాజిరెడ్డిగూడెం మండలంలో చాలా మంది రేషన్ లబ్ధిదారులు, ఇతరులు వారి చిన్నారుల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించలేదు. కానీ ప్రభుత్వం ఈ–కేవైసీ తప్పని సరి చేయడంతో జనమంతా ఆధార్ కేంద్రాలకు వెళ్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండలానికి సంబంధించి అర్వపల్లిలో గతంలో ఆధార్‌కేంద్రం ఉండేది. నాలుగేళ్ల కిందటే ఇక్కడ ఆధార్ కేంద్రాన్ని రద్దు చేశారు. దీంతో చిన్నపిల్లల ఆధార్ అప్‌డేట్ కోసం సూర్యాపేట జిల్లా కేంద్రానికి లేదా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. అక్కడి కేంద్రాల్లో కూడా రద్దీ బాగా ఉంటుండటంతో రోజంతా పడిగాపులు కాయాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్వపల్లిలో ఆధార్ కేంద్రాన్ని పునరుద్ధరించి ఇబ్బందులు తీర్చాలని మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వారం రోజులు తిరిగినా వృథా



రేషన్‌కార్డుకు ఆధార్ అప్‌డేట్ కోసం రేషన్ దుకాణానికి వెళ్లగా వేలి ముద్రలు పడకపోవడంతో ఆధార్ సెంటర్‌కు వెళ్లాలని సూచించారు. అర్వపల్లిలో ఆధార్ సెంటర్ లేక సూర్యాపేటకు వెళ్లగా అక్కడ రద్దీగా ఉండి మూడు రోజులు తిరిగినా ఫలితం లేకుండాపోయింది. చివరకు తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి వెళ్లి అక్కడి సెంటర్లో అప్‌డేట్ చేయించుకున్నాను.

– సాయిఅరవింద్, విద్యార్థి, అర్వపల్లి

ఆధార్ సెంటర్‌ను పునరుద్ధరించాలి



ఆహార భద్రత కార్డుకు ఈ–కేవైసీ అనుసంధానం చేయడానికి తరచుగా ఆధార్ సెంటర్ అవసరం వస్తుంది. పిల్లల ఆధార్‌లో అప్‌డేట్ చేసుకుంటేనే వారికి ఈ–కేవైసీ పునరుద్ధరణ జరుగుతుంది. ఇక్కడ ఆధార్ సెంటర్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే అర్వపల్లిలో ఆధార్ సెంటర్‌ను పునరుద్ధరించాలి.

– మచ్చ నర్సయ్య, ప్రగతిశీల విద్యార్థులు, తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సీఎం సభను జయప్రదం చేయాలి



తుంగతుర్తి : బండరామారంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తుంగతుర్తి : తిరుమలగిరిలో నేడు జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శనివారం బండరామారం గ్రామంలో బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించి, ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో గద్దం ఉప్పలయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : నేడు తిరుమలగిరిలో సీఎం కేసీఆర్ పాల్గొనే సమర శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు యారాల నర్సింహారెడ్డి కోరారు. శనివారం డి.కొత్తపల్లిలో సభ పోస్టర్లు, కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పడశాల పెద్దలింగయ్య, సంపెట చంద్రయ్య, అశోక్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి

నేడు తిరుమలగిరిలో జరిగే కేసీఆర్ సభను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయనతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

అర్వపల్లి : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రజలకు వివరించాలని జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ కోరారు. ఆదివారం తిరుమలగిలో జరిగే సీఎం కేసీఆర్ సభ విజయవంతానికై శనివారం సీతారాంపురంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సమావేశంలో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే కిషోర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు బైరబోయిన రామలింగయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బందెల అర్వపల్లి, అరిగె వెంకన్న, బందెల వెంకన్న, శశికాంత్, సుంకరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : తిరుమలగిరిలో నేడు జరిగే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి కోరారు. శనివారం చిల్పకుంట్లలో బహిరంగ సభ విజయవంతం కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బిక్కి బుచ్చయ్యగౌడ్, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పులుసు లింగమల్లయ్య, బత్తుల విద్యాసాగర్, బాణాల సత్యనారాయణరెడ్డి, బత్తుల సురేష్, పులుసు కనకయ్య, తొట్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా ఇచ్చిన హామీలను అమలు చేస్తాం



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

సూర్యాపేట రూరల్ : కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తామని సూర్యాపేట నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు తెలిపారు. శనివారం ప్రజా సంగ్రామ యాత్రలో భాగంగా సూర్యాపేట రూరల్, రాజునాయక్‌తండా, లక్ష్మీతండా, బాలెంల, ఆరేగూడెం, దాస్‌తండా గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన పార్టీ బీజేపీ అని అన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీసీని సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తారా అని ప్రశ్నించారు. జన గర్జన సభకు జిల్లా నలమూలల నుంచి భారీ సంఖ్యలో హాజరయ్యారన్నారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంటే, ఆ నిధులను బీఆర్‌ఎస్ నాయకులు కాజేశారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి జిల్లాకు రైల్వే లైన్‌తో తెప్పిస్తానని, జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మార్చుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెన్న శశిధర్‌రెడ్డి, జిల్లా నాయకులు ఉప్పు శ్రీనివాస్, మండల నాయకులు మొండికత్తి శివాజీ, బోర రమేష్, మామిడి వెంకన్న, తాడూరి రాజు, లూనావత్ రవీందర్, భూక్య నాగరాజు, చెవుల వెంకన్న, బొజ్జియా నాయక్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను ఎజెండాగా చేర్చాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ఆత్మకూరు (ఎస్) : సంఘటిత, అసంఘటిత రంగాల్లో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న కార్మికుల, ఉద్యోగుల సమస్యలను ఎన్నికల్లో పోటీ చేసే పార్టీలు మేనిఫెస్టోల్లో ఎజెండాగా చేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆత్మకూరు మండల పరిధిలోని నెమ్మికల్‌లో సీఐటీయూ ఆత్మకూరు మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వస్తువుల ఎగుమతి, దిగుమతి హమాలీలు, తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ప్రమాద బీమా రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ఐక్యంగా ఉండి రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో కార్మికుల సమస్యలను చేర్చేవిధంగా ఒత్తిడి పెంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ యాతాకుల వెంకన్న, విజయ, పిండుగ శ్రీను, మండల వీరన్న, అబ్బయ్య, బండారు నాగయ్య, జలగం భిక్షం, జైల్‌సింగ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ





ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచిన జయ పాఠశాల విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏఎంటీఐ గణిత ఒలింపియాడ్‌లో జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలకు చెందిన విద్యార్థులు మొదటి లెవల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండవ లెవల్‌కు అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. శనివారం పాఠశాలలో ప్రతిభ కబనరిచిన విద్యార్థులను అభినందించారు. ఏఎంటీఐ చెన్నై వారు జాతీయ స్థాయిలో నిర్వహించిన గణిత ఒలింపియాడ్‌లో పాఠశాలకు చెందిన 73 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి న ట్లు చెప్పారు. ఈ పరీక్షలో ప్రైమరీ లెవల్ నుంచి 18, సబ్ జూనియర్ లెవల్ నుంచి 27, జూ నియర్ లెవల్ నుంచి 28 మంది అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరి చిన వారిని కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జిల్లా పద్మ అభినందించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం డీఎస్పీ శ్రీనివాస్‌రావు, తదితరులు

చివ్వెంల : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ సుంకర శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులోని శ్రీ స్వామి నారాయణ్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లో అనవసరమైన లింక్‌లు ఓపెన్ చేయవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులతో వాట్సప్, ఫేస్‌బుక్‌లకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రస్వరూప్ దాజ్‌జీ స్వామీజీ, ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాస్, డైరెక్టర్ హర్థిక్, సీఐ రవికుమార్, సిబ్బంది మహేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.